రైతు బజారు లేక అవస్థలు



దక్షిణ నియోజకవర్గం ముఖచిత్రం

డాబాగార్డెన్స్: పాత నగరంలో రైతు బజారు లేక ప్రజలు అవస్థలు పడతున్నారు. స్పందించే నాథుడే కరువయ్యాడు. దక్షిణ నియోజకవర్గ పరిధిలో రైతు బజారు లేక స్థానికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వం సబ్సిడీ ధరలకు అందించే నిత్యావసర వస్తువులు, కూరగాయలు అందక ఎక్కువ డబ్బులతో కొనాల్సి వస్తోందని వాపోతున్నారు. ఫలితంగా దక్షిణ నియోజకవర్గ ప్రజలు నిత్యావసర సరుకులు..కూరగాయలకు వేరే నియోజకవర్గాల్లో గల రైతు బజార్లను ఆశ్రయించాల్సి వస్తోంది. విశాఖ దక్షిణ నియోజకవర్గమంటే విశాఖకు ఆయువుపట్టు. ఇక్కడి నుంచే ప్రభుత్వాలకు వారధిగా కార్యకలాపాలు సాగుతుంటాయి. ఈ ప్రాంతం ఒకప్పుడు ఆర్థిక కేంద్రంగా నడిచింది. బ్రిటిష్ కాలంలో కూడా విశాఖకు పేరొచ్చిందంటే ఈ ప్రాంతం నుంచే... కానీ ఇక్కడ ఉన్న వారికి ఎటువంటి సౌకర్యాలు అందడం లేదు. చాలా మంది ఈ ప్రాంతాన్నే నమ్ముకుని ఉండిపోయారు. ముఖ్యంగా సబ్సిడీ ధరలకు ప్రభుత్వం అందించే ఫలాలు ఏమీ అందడం లేదనే ఆవేదనతో ఉన్నారు. నియోజకవర్గంలో ఉండేది బడుగు, బలహీన వర్గాల వారే. ఉదయం పోయి..రాత్రి పొద్దుపోయే దినసరి కూలీలు.. కలాసీలు..రోజువారీ కూలీలు..ఆటో కార్మికులు..ఇలా అల్పాదాయ వర్గానికి చెందినవారే ఈ ప్రాంతంలో నివాసముంటున్నారు. వీరు రోజంతా కష్టపడితే నాలుగైదు వందల రూపాయలు మాత్రమే వస్తాయి. పెద్ద ఎక్కువ మొత్తం పెట్టి నిత్యావసర వస్తువులు, కూరగాయలు కొనలేక అవస్థలు పడతున్నారు. ఇటువంటి వారి కోసం నియోజకవర్గ పరిధిలో రైతు బజారు ఏర్పాటు చెయ్యాలని ప్రజాప్రతినిధులను మొత్తుకున్నా..స్పందించలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

నగరంలో ఇలా..

విశాఖ మహానగరంలో పలు రైతు బజార్లు నడుస్తున్నాయి. తూర్పు నియోజకవర్గంలో త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పక్కన, ఎంవీపీ కాలనీలో రైతు బజార్లుండగా, ఉత్తర నియోజకవర్గం విషయానికొస్తే సీతమ్మధార, నరసింహనగర్, కంచరపాలెం, మద్రిపాలెంలో రైతు బజార్లు నడుస్తున్నాయి. అలాగే పశ్చిమ నియోజకవర్గం, గాజువాక, పెందుర్తిలో రైతు బజార్లు నడుస్తుండగా విశాఖ దక్షిణ నియోజకవర్గంలో ఒక్క రైతు బజారు కూడా లేకపోవడం శోచనీయమే. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రైతు బజార్ ఏర్పాటు దిశగా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

కంచరపాలెం వెళ్లాల్సి వస్తుంది



మా ప్రాంతంలో ఎక్కడ కూడా రైతు బజార్లు లేకపోవడంతో ఐదారు కిలోమీటర్ల దూరంలో ఉన్న కంచరపాలెం రైతు బజార్‌కు వెళ్లాల్సి వస్తుంది. ఆ లాభం ప్రయాణ చార్జీలకే సరిపోతుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి, రైతు బజార్ ఏర్పాటు చేయాలి.

–వద్రి వరలక్ష్మి, స్థానికురాలు

అధికారులు స్పందించాలి



ప్రభుత్వం రైతు బజార్ల ద్వారా సబ్సిడీ ధరలకే నిత్యావసర వస్తువులు, కూరగాయాలు అందజేస్తోంది. కానీ దక్షిణ నియోజకవర్గ పరిధిలో రైతు బజార్ లేకపోవడంతో సబ్సిడీ ధరలకు నిత్యావసరాలు కొనుగోలు చేయలేని పరిస్థితి ఉంది. అధికారులు ఈ ప్రాంతాన్ని పట్టించుకోవడం లేదు.

–పసగాడ రామలింగేశ్వరరావు, స్థానికుడు

10న కోర్కెల దినం విజయవంతం చేయండి

డాబాగార్డెన్స్: మూడోసారి అధికారంలోకి వచ్చిన కేంద్ర బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అమలు చేయడానికి పూనుకుంటుందని, ఈ విధానాలకు అడ్డుకట్ట వేసేందుకు జూలై 10న దేశ వ్యాప్తంగా కోర్కెల దినం విజయవంతం చేయాలని సిటూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు పిలుపునిచ్చారు. సిటూ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర బీజేపీ ప్రభుత్వం లేబర్‌కోడ్స్ అమలు చేసే ఉత్తర్వులు ఇవ్వడానికి సిద్ధపడుతోందన్నారు. కేంద్రం, రాష్ట్రంలోని ఎన్డీఏ ప్రభుత్వాలు ఏర్పడిన తర్వాత కార్మిక ప్రజా వ్యతిరేక చట్టాలు అమలు చేయడానికి తగిన కార్యాచరణ రూపొందిస్తుందన్నారు. పీఎఫ్‌కు సంబంధించి యాజమాన్యం వాటా చెల్లించకపోతే పెనాల్టీతో చెల్లించాలని నిబంధన తొలగించారన్నారు. ఇప్పుడు యాజమాన్యం కార్మికుల ఖాతాలో జమ చేయాల్సిన వాటాను ఎప్పుడైనా కట్టవచ్చని, ఇప్పటి వరకు ఉండే పెనాల్టీ నిబంధనలు ఉన్నా, చాలా కంపెనీలు ఇన్‌టైంలో పీఎఫ్ ఖాతాలో జమచేయడం లేదన్నారు. పూర్తి విచారణ జరిపి నాన్‌బెయిల్‌బుల్ వారెంట్ ఇవ్వడానికి ఉన్న అవకాశాన్ని కూడా తొలగించారన్నారు. దీని వల్ల పెన్షన్ భవిష్యత్‌లో వస్తుందని గ్యారెంటీ లేదని, 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్‌ను యజమానులకు ఉండడం వల్ల కార్మికవర్గం తీవ్ర శ్రమదోపిడీకి గురవుతుందన్నారు. తక్షణమే లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, ప్రైవేటీకరణను, జాతీయ నగదు బదిలీకరణ పథకం ఆపాలని, కనీస వేతనాలు నెలకు రూ.26వేలు చొప్పున నిర్ణయించి అమలు చేయాలని, కాంట్రాక్ట్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. జూలై 10 దేశవ్యాప్తంగా కోర్కెల దినం జరపాలని పిలుపునిచ్చారు.

కేజీహెచ్ అభివృద్ధికి మరింత కృషి


రోగుల సహాయకుల విశ్రాంత గదిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

మహారాణిపేట: కేజీహెచ్‌లో మరిన్ని సౌకర్యాలను కల్పించడానికి తనవంతు కృషిచేస్తానని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ హామీ ఇచ్చారు. గురువారం కేజీహెచ్‌లోని నవజాత శిశు తీవ్ర వ్యాధుల చికిత్స కేంద్రం ఎదురుగా రూ. 15 లక్షల ఆస్పత్రి అభివృద్ధి నిధులతో చేపట్టిన రోగుల సహాయకుల వేచి ఉండు గదిని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వంశీ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి నిత్యం రోగులు ఇక్కడకు వస్తుంటారని, ఇటువంటి ఆస్పత్రికి మరిన్ని వసతులు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. విశ్రాంత గదికి అవసరమైన వాటర్ ప్లాంటును దాతల సహకారంతో త్వరలో ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే రోగుల సహాయకులు వేచి ఉండేలా మరిన్ని గదులను నిర్మించేందుకు కృషిచేస్తామని పేర్కొన్నారు. వీటితో పాటు కెజిహెచ్ అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ మాట్లాడుతూ గతంలో రోగుల సహాయకులు ఆస్పత్రి వెలుపల వేచి ఉండాల్సి వచ్చేదన్నారు. ప్రస్తుతం ఈ గది అందుబాటులోకి రావడంతో సుమారు 100 మంది సహాయకులు వేచి ఉండేందుకు అవకాశం లభించిందని తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్రా వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, కేజీహెచ్ డిప్యూటీ సూపరింటిండెంట్ డాక్టర్ వాణి, డాక్టర్ రాధాకృష్ణ, పిల్లల వార్డు విభాగాధిపతి డాక్టర్ బి.ఎస్.చక్రవర్తి, ఎఆర్ఎంవో డాక్టర్ దవళ భాస్కరరావు, ఏపీఎంఎస్ఐడీసీ కార్యనిర్వాహక ఇంజినీర్ డి.అచ్చంనాయుడు, ఏడీ శ్రీనివాస్ కుమార్, ఇతర వైద్య సిబ్బంది, రోగుల సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు ఐరన్ మాత్రలు అందజేయాలి


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: గర్భిణులకు ఐరన్ మాత్రలు అందజేయాలని, సాధారణ ప్రసవాలు జరిగేలా సిబ్బంది సహకారం అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు కోరారు. గురువారం ఆరిలోవ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఆరోగ్య కార్యక్రమాలను, అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్, సెషన్ ప్లానింగ్, లబ్ధిదారుల జాబితాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ముఖ్యంగా డయేరియా పై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు ఆయన ఆదేశించారు. రానున్న వర్షాకాలంలో కీటక జనిత వ్యాధులు రాకుండా చూసుకోవాలని, ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని డీఎంహెచ్‌వో సూచించారు. ఈ సందర్భంలో డీపీవో ఎన్‌హెచ్‌ఎం శశి భూషణ్, పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

సిరులతల్లికి పంచామృతాభిషేకం


కనకమహాలక్ష్మి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్త రోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసులరెడ్డి, సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్న వాసుపల్లి


కనకమహాలక్ష్మి అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

అల్లిపురం: బురుజుపేటలో వెలసిన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఆయన పూజలు నిర్వహించారు. అమ్మవారికి స్వయంగా అభిషేకాలు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ప్రజల కల్పవల్లి దక్షిణ నియోజకవర్గంలో కొలువై ఉండటం స్థానిక ప్రజలతో పాటు ఈ ప్రాంత వాసిగా తన అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. కార్యక్రమంలో ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

లలితా పీఠంలో ఆధ్యాత్మిక కవితా గోష్ఠి


నన్నయ సహస్రాబ్ది సంచికను ఆవిష్కరిస్తున్న సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి

సీతంపేట: లలితానగర్ శ్రీలలితా పీఠంలో జరుగుతున్న గురువుల ఆరాధనోత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం రచయిత డి.వి. సూర్యారావు ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కవితా గోష్ఠి నిర్వహించారు. 24 మంది కవులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుర్తాళం శంకరాచార్యులు సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి చేతుల మీదుగా ఆదికవి నన్నయ సహస్రాబ్ది సంచికను ఆవిష్కరించారు. ఈ సభకు ఆచార్య కోలవెన్ను మలయవాసిని అధ్యక్షత వహించారు. కవితా గోష్ఠి అనంతరం కవులను స్వామి వారు సత్కరించారు. అనంతరం అనుగ్రహ భాషణం చేశారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు భువన విజయం సాహితీ రూపకం ప్రదర్శన ఉంటుందని తెలిపారు.

నేడు మాక్‌డ్రిల్

మల్కాపురం: సంస్థలో జరిగే ప్రమాదాలు, విపత్తులు, అత్యవసర పరిస్థితుల్లో కార్మికులు వారిని వారు ఎలా రక్షించుకుంటారు, ఆపదలో ఉన్న వారిని ఎలా రక్షిస్తారు.. అనే అంశంపై కోరమాండల్ ఇంటర్నేషనల్ సంస్థలో శుక్రవారం ఉదయం మాక్‌డ్రిల్ నిర్వహించనున్నారు. డిస్ట్రిక్ అడ్మినిస్ట్రేషన్ వారి పర్యవేక్షణలో కోరమాండల్ సంస్థను ఆనుకుని ఉన్న పిలకవానిపాలెంలో మాక్‌డ్రిల్ జరుగుతుంది.

జిల్లా గ్రంథాలయ భవన నిర్మాణానికి ఉద్యమమే శరణ్యం

మాజీ ఎమ్మెల్సీ ఎంవీవీ శర్మ



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవీవీ శర్మ

అల్లిపురం: జిల్లా గ్రంథాలయ సంస్థకు చెందిన ఎకరా స్థలంలో గ్రంథాలయ భవన నిర్మాణానికి ఉద్యమమే శరణ్యమని మాజీ ఎమ్మెల్సీ ఎంవీవీ శర్మ స్పష్టం చేశారు. విశాఖ మహానగరంలో విద్యార్థులు, నిరుద్యోగులు, ప్రజలకు సరైన ప్రభుత్వ గ్రంథాలయం లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, రాజకీయ నేతలకు గ్రంథాలయం అవసరం పట్టలేదని ఆయన ఆరోపించారు. డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో పౌరగ్రంథాలయ సేవా సమితి అధ్యక్షుడు బి.ఎల్.నారాయణ అధ్యక్షత జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా గ్రంథాలయ సంస్థకు చెందిన ఎకరా స్థలం నేటికి సీఆర్‌పీఎఫ్ వారి ఆధీనంలో ఉందన్నారు. గ్రంథాలయం పునర్నిర్మాణం కోసం కొత్త ప్రభుత్వం పూనుకోవాలని ఆయన కోరారు. గ్రంథాలయానికి నిధుల కొరత లేదన్నారు. ప్రజలను ముక్కుపిండి ఆస్తిపన్ను వసూలు చేసిందని, అందులో 8 శాతం లైబ్రరీ సెస్ రూ.200 కోట్లకు పైగా జీవీఎంసీ గ్రంథాలయ సంస్థకు బకాయి పడిందన్నారు. అధికారం ఇస్తే గ్రంథాలయ భవన నిర్మాణం చేపడతానని జనసేన అధ్యక్షుడు పవన్ ఇచ్చిన మాట ఇప్పుడు నిలబెట్టుకోవాలన్నారు. లేకపోతే భవనం పునర్నిర్మాణం కోసం ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో గ్రంథాలయ సమితి రిటైర్డ్ కార్యదర్శి కె.త్రిమూర్తులు, కోశాధికారి పి.మల్లేశ్వరరావు, ఏయూ ప్రొఫెసర్ సుబ్బారాయుడు, సీహెచ్‌వీ ఎల్ఎన్ శాస్త్రి, పి.మణి, ఎన్.ప్రకాశరావు, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

సెయిల్‌లో విలీనంతో ‘ఉక్కు’కు పూర్వవైభవం


మాట్లాడుతున్న ఉక్కు పోరాట కమిటీ నాయకుడు శ్రీనివాసరావు

అగనంపూడి: విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేయగలిగితే పునరుజ్జీవం పొంది, పూర్వ వైభవాన్ని సంతరించుకోగలదని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకుడు వరసాల శ్రీనివాసరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలేదీక్షలు గురువారానికి 1232వ రోజుకు చేరుకున్నాయి. శిబిరంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రిపై ఒత్తిడి పెంచడానికి అఖిలపక్ష నాయకులతో సమావేశం ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చొరవ తీసుకోవాలని కోరారు. వీరిద్దరూ తలచుకుంటే ఉక్కు ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగడంతో పాటు పూర్వవైభవం ఉక్కుకు రాగలదన్నారు. నాలుగు దశాబ్దాల పాటు ఎన్నో అవరోధాలు, ఆటంకాలను దాటుకుని ఉక్కు పరిశ్రమను విస్తరించుకుంటే పారిశ్రామికవేత్తల ఆకలిని తీర్చడానికి విశాఖ ఉక్కును బలిపశువును చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో నాయకులు జయ, బి.ఎస్.రాజు, డి.సి.హెచ్.వెంకటేశ్వరరావు, శ్రీనివాస్, అప్పారావు, గోవింద్, రమణ, దాసరి శ్రీను, గంగాధర్, అప్పారావు, అంజి తదితరులు పాల్గొన్నారు.

ఒకటో తేదీ నుంచి సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాలు


సమావేశాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న స్టాలిన్ తదితరులు

గాజువాక: జూలై ఒకటో తేదీ నుంచి మూడో తేదీ వరకు నగరంలోని మురళీనగర్‌లో సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాలను నిర్వహించనున్నట్టు ఆ పార్టీ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు ఎ.జె.స్టాలిన్ తెలిపారు. గాజువాకలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ, రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రైల్వే జోన్ ఏర్పాటు, విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ తదితర అంశాలపై ఈ సమావేశాల్లో చర్చలు జరుపుతామన్నారు. గత ప్రభుత్వాలు చేసిన పొరపాట్లు, ప్రతికూల పోకడలపై చర్చించడంతో పాటు ప్రస్తుత ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై కూడా ఈ సమావేశాల్లో చర్చించి, తీర్మానాలను చేస్తామన్నారు. ప్రస్తుత ప్రభుత్వం మతోన్మాద పార్టీ బీజేపీతో అంటకాగుతోందని, గత ప్రభుత్వంలో దొర్లిన తప్పులనే మళ్లీ చేయకుండా ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే విధంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని అన్నారు. సమావేశంలో నాయకులు కసిరెడ్డి సత్యనారాయణ, ఎల్లేటి శ్రీనివాసరావు, జి.ఆనంద్, పి.దుర్గారావు, కె.పోతయ్య, కె.రాజబాబు, కె.అచ్యుతరావు, అప్పారి విష్ణుమూర్తి, కె.వనజాక్షి తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న స్వామికి ఘనంగా ఆర్జిత సేవలు


స్వర్ణ పుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న భక్తులు


నిత్య కల్యాణంలో తలంబ్రాలు ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చనను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ బేడా మండపంలో స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్టింపజేసి 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. సింహాద్రి అప్పన్న స్వామికి గురువారం 9.30 గంటల నుంచి నిత్య కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులను బేడా మండపంలో వేదికపై అధిష్టింపజేసి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా సాగింది.

బోటు యజమానులకు నష్టపరిహారం అందజేత


బోటు యజమానులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

మహారాణిపేట: వివిధ కారణాల వల్ల ప్రమాదాలకు గురైన బోట్లకు నష్టపరిహారాన్ని ఎమెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ చేతులుగా అందజేశారు. గురువారం శివాజీపాలెంలో జరిగిన కార్యక్రమంలో 36 మంది బోటు యజమానులకు రూ.1.35 కోట్లను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మంజూరైంది. ఎన్నికల కోడ్ వల్ల చెక్కు పంపిణీ కాలేదు. గురువారం చెక్కులను మత్స్యశాఖ అధికారుల సమక్షంలో ఎమ్మెల్యే బోటు యజమనులకు అందజేశారు. కార్యక్రమంలో మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ విజయకృష్ణ, ఎఫ్‌డీవో ఆశాజ్యోతి, ఏపీ మరపడవల సంఘం మాజీ అధ్యక్షుడు పీసీ అప్పారావు, ఇతర నాయకులు జీ.రవి, సీహెచ్ రమేష్, బి.కొండబాబు, ఎం.మసేను,ఎం.బాలాజీ, కె.చిన్న పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం


పీఆర్‌వో నాయుడికి చెక్కు అందజేస్తున్న దాత నాగేశ్వరరావు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి గురువారం పీఎం పాలేనికి చెందిన బలిజి నాగేశ్వరరావు లక్ష రూపాయల విరాళం అందజేశారు.

సింహగిరిపై విచారణ కార్యాలయంలో సంబంధిత చెక్కుని దేవస్థానం పీఆర్‌వో నాయుడికి అందజేశారు. దేవస్థానం తరపున దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఉద్యోగి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పోర్ట్ అథారిటీ బోర్డ్ మెంబర్‌గా పోతన్న



కంచరపాలెం: విశాఖ హార్బర్ పోర్ట్ వర్కర్స్ ఏఐటీయూసీ నుంచి యు.పోతన్న విశాఖ పోర్ట్ అథారిటీ బోర్డు మెంబర్‌గా నియమితుడయ్యారు. ఈ మేరకు పోర్ట్ మినిస్ట్రీ ఆఫ్ షిప్పింగ్ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా పోతన్నను యూనియన్ సభ్యులు, కార్మికులు అభినందించి ఘనంగా సత్కరించారు.

బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన


బాల్య వివాహాలు వద్దంటూ కళాజాతలో వివరిస్తున్న కళాకారులు

పెదగంట్యాడ: ‘బాల్య వివాహాలు వద్దు.. బాలికలను రక్షిద్దాం.. బాలికలను చదివిద్దాం’ అంటూ ప్రదర్శించిన కళాజాత ఆలోచింపజేసింది. ఐసీడీఎస్ పెందుర్తి ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో పెదగంట్యాడ సెక్టార్ పరిధిలోని 64వ వార్డు గంగవరంలో చేపలపాలెం అంగన్‌వాడీ కేంద్రం వద్ద అంగన్‌వాడీ కార్యకర్త శ్రీరం దుర్గమ్మ ఆధ్వర్యంలో గురువారం కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోర బాలికలు, బాలింతలు, గర్భిణులు, స్థానిక మహిళలకు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. బాలల హక్కు చట్టాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇస్తున్న పౌష్టికాహారం గురించి పాటలతో వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పడాల శాంతి, పేర్ల దేముడమ్మ, సచివాలయం సిబ్బంది, ఆశ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

పల్లెను ప్రతిబింబించేలా..


ఆరిలోవ: పల్లె సంస్కృతి సంప్రదాయాలకు జీవం పోస్తూ జాతీయ రహదారిపై డెయిరీ ఫారం కూడలిలో ఏర్పాటు చేసిన కళాకృతులు ఆకట్టుకుంటున్నాయి. జీవీఎంసీ నగరంలో కూడళ్ల ఆధునికీకర
గొడుగు వేసుకొని పొలంలోకి వెళ్తున్న రైతు బొమ్మ

ణకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా పలు కూడళ్లు ఇప్పటికే సిద్ధమయ్యాయి. మరికొన్ని కూడళ్లు రూపుదిద్దుకుంటున్నాయి. పాత డెయిరీ ఫారం వద్ద కూడలి ఆధునికీకరణ పనులు దాదాపు పూర్తయ్యాయి. ఇక్కడ గతంలో వాటర్ ఫౌంటేన్, మధ్యలో పడవ ఉన్నట్లు తయారు చేశారు. ఇటీవల ఆ ఆకృతిని తొలగించి మరింత శోభను తీసుకొచ్చేలా డిజైన్ చేశారు. ఇక్కడి కూడలిలో నాలుగు బొమ్మలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వాటికి పెయింటింగ్ వేస్తున్నారు. ఈ కూడలిలో ఆంజనేయస్వామి గుడి ఎదురుగా ఎడ్ల బండి ఏర్పాటు చేసి చుట్టూ గ్రిల్స్ పెట్టారు. ఆ బొమ్మకు వేసిన రంగులు ప్రయాణికులను ఆకట్టుకుంటున్నాయి. దీనికి ఎదురుగా రెండు మట్టి కుండలు పట్టుకుని కూర్చొన్న పల్లెటూరి మహిళ, ఆ పక్కనే ఓ చక్రం బొమ్మ అమర్చారు. వీటితో పాటు కూడలికి రెండు వైపులా రైతు బొమ్మలు తీర్చిదిద్దారు. ఓ వైపు తాటాకుల గొడుగు వేసుకొని పొలంలోకి వెళ్తున్న రైతు బొమ్మ, మరో వైపు ఎండలో తాటాకుల గొడుగు వేసుకొని చేత పార పట్టుకుని పొలం పని చేస్తున్న మరో రైతు బొమ్మ ఏర్పాటు చేశారు. ఈ బొమ్మలకు కార్మికులు ప్రస్తుతం పెయింటింగ్ వేస్తున్నారు. ఈ కూడలిలో ఏర్పాటు చేసిన పల్లెటూరి బొమ్మలు స్థానికులు, ప్రయాణికులకు ఆకట్టుకుంటున్నాయి.


కూడలిలో ఏర్పాటు చేసిన మట్టి కుండలతో పల్లెటూరి మహిళ ప్రతిమ


డెయిరీ ఫారం కూడలిలో ఏర్పాటు చేసిన ఎడ్ల బండి ఆకృతి